ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
7 జనగామ
గురువారం 13 జూన్ 2024



జఫర్‌గఢ్‌లో ఇంటింటా తాగునీటి వివరాలు సేకరిస్తున్న జీపీ సిబ్బంది



తాగునీరు అందుతోందా?

- 'మిషన్ భగీరథ'పై కొనసాగుతున్న సర్వే
- పదిరోజుల పాటు ఇంటింటా నిర్వహణ
- పథకం అమలు తీరుపై ఆరా తీస్తున్న సిబ్బంది
- 11 అంశాలపై క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ
- ఎప్పటికప్పుడు ప్రత్యేక యాప్‌లో నమోదు
- తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం
- జిల్లాలో 1.34 లక్షల నల్లా కనెక్షన్లు

మిషన్ భగీరథ అనే బృహత్ పథకం కింద రాష్ట్రంలో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని గత ప్రభుత్వం ప్రకటించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పథకం కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులను నిలిపివేసింది. ఇంటింటికీ తాగునీరు అందుతున్నపుడు ప్రత్యేకంగా మళ్లీ నిధులెందుకని అభ్యంతరం తెలిపింది. మరోవైపు గత ప్రభుత్వం ప్రకటించినట్లుగా రాష్ట్రంలో వందశాతం తాగునీరు అందడం లేదు. క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి నిధులు రాబట్టాలంటే ఇంటింటా సర్వే చేసి కేంద్రానికి నివేదించాలని ప్రస్తుత సర్కారు భావించి అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా ఈ నెల 10వ తేదీనుంచి జిల్లాలో సర్వే కొనసాగుతోంది.

జఫర్‌గడ్, జూన్ 12: గత ప్రభుత్వం లక్షల కోట్లు వెచ్చించి గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో ఈ పథకం కింద ట్యాంకులను నిర్మించి పైపులైన్లు వేసి ఇంటింటా నల్లాలను ఏర్పాటు చేసింది. ఒక్కో మనిషికి కనీసం వంద లీటర్ల నీటిని అందించేందుకు ప్రణాళికలు తయారు చేసింది. కానీ, ఈ పథకం అమలులో క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలు వస్తున్నాయి. అనేక చోట్ల నల్లాలను అమర్చలేదు. కొన్ని ప్రాంతాల్లో గ్రామానికి దూరంగా ట్యాంకులను నిర్మించి నివాసాలకు పైపులైన్లు వేయకుండా వదిలేశారు. పాత పైపులైన్ల ద్వారానే తాగునీరు సరఫరా చేస్తున్నారు. పైపులైన్ల లీకేజీలు అధికంగా ఉన్నా యి. ఇదిలా ఉంటే.. రాష్ట్రంలో వందశాతం ఇళ్లకు తాగునీరు సరఫరా చేస్తున్నామని గత ప్రభుత్వం ప్రకటించినందున కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. జల్ జీవన్ మిషన్ పథకం కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులను నిలిపివేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకంపై పూర్తి వివరాలను సేకరించి తద్వారా కేంద్రం నుంచి నిధులను రాబట్టుకోవాలనే ఉద్దేశంతో సమగ్ర సర్వేకు పూనుకుంది. ఇందులో భాగంగా జిల్లాలో ఈ నెల 10వ తేదీ నుంచి సర్వే ప్రారంభమైంది. పది రోజుల పాటు నిర్వహించే ఈ ప్రక్రియ కలెక్టర్ నేతృత్వంలో కొనసాగుతోంది. అనంతరం తుది నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపించాలని సర్కారు ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో 281 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 1,34,971 నల్లా కనెక్షన్లు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

వివరాల సేకరణ, యాప్‌లో నమోదు..

ఇంటింటి సర్వేకు గాను ఎంపిక చేసిన సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. గ్రామస్థాయిలో కార్యదర్శి నేతృత్వంలో జరిగే ఈ సర్వేలో భాగంగా అంగన్‌వాడి టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. భగీరథ నీటి సరఫరాకు నల్లా కనెక్షన్ ఉందా? నీళ్లు సక్రమంగా వస్తున్నాయా? పైపులైన్ల లీకేజీలు ఉన్నాయా? శుద్ధమైన నీరు అందుతోందా? నల్లా పని చేస్తోందా? నీళ్లు ఎన్ని రోజులకు వస్తున్నాయి? కుటుంబ సభ్యులకు సరిపోతున్నాయా? వంటి 11 అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు. అదేవిధంగా కుటుంబ యజమాని పేరు, చిరునామా, మొబైల్ నంబరు, ఆధార్, ఇంటి నంబరు తీసుకుంటున్నారు. కుటుంబ యజమానితో కలిసి ఇంటి ఫోటో, నల్లా ఫొటోను తీసుకుని ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారమయ్యేనా..?

జిల్లాకు మల్లన్న సాగర్, ధర్మసాగర్‌లోని రెండు మిషన్ భగీరథ గ్రిడ్‌ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో మిషన్ భగీరథ పథకం ద్వారా 1,34,971 నల్లా కనెక్షన్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే నాసిరకమైన పైపుల వల్ల లీకేజీలు ఏర్పడడం, కొన్ని చోట్ల గ్రామాలకు దూరంగా ట్యాంకులను నిర్మించడం, పైపులైన్లను సక్రమంగా వేయకపోవడం వంటి సమస్యల మూలంగా ప్రజలకు భగీరథ నీరు ఆశించిన స్థాయిలో అందడం లేదు. పలు గ్రామాల్లో పాత నల్లాల ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో భగీరథ నీళ్లు సరిపోకపోవడంతో పంచాయతీ బోరు బావుల నుంచి సరఫరా చేస్తున్నారు. ఈ సర్వే ద్వారా లోపాలను గుర్తించి సరిదిద్దుతారా.. లేక తూతూ మంత్రంగానే సర్వే నిలిచిపోతుందా? అని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో సర్వే కొనసాగుతోంది...

- అనిల్‌కుమార్, ఇన్‌చార్జి డీపీవో, జనగామ



మిషన్ భగీరథ పథకంపై జిల్లాలో ఇంటింటా సర్వే గత సోమవారం నుంచి ప్రారంభమైంది. కలెక్టర్ పర్యవేక్షణలో ఈ సర్వే కొనసాగుతోంది. సర్వే కోసం ఎంపిక చేసి న ఉద్యోగులకు శిక్షణ ఇచ్చాం. వారు ఇంటింటికీ వెళ్లి వివరాలు తెలుసుకుని యాప్‌లో నమోదు చేస్తున్నారు. సర్వే పది రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. క్షేత్ర స్థాయిలో సర్వేను పక్కాగా నిర్వహించేలా చూస్తున్నాం. సర్వే ద్వారా గుర్తించిన సమస్యలు, అంశాలు, వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తాం.

తాగునీటి సమస్య పరిష్కారానికి దోహదం..

- వి.శ్రీకాంత్, ఈఈ, ఇంట్రా డివిజన్, జనగామ



తాగునీటి సరఫరాలోని లోపాలను, సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ఈ సర్వే దోహదపడుతుంది. జిల్లాలో రెండు మిషన్ భగీరథ గ్రిడ్‌ల ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అవుతోంది. అయితే ఇందులో ఉన్న సమస్యలపై వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నాం. సర్వే కోసం జిల్లాలో 763 మందికి శిక్షణ ఇచ్చాం. కలెక్టర్ పర్యవేక్షణలో.. డీపీవో ఆధ్వర్యంలో సర్వే కొనసాగుతోంది.



సభలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు..

- అహంకారం లేకుండా పని చేయాలి
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- మడికొండలో ఎంపీ కడియం కావ్య ఆత్మీయ సన్మాన సభ

9



కడియం శ్రీహరి, కావ్యను సన్మానిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

మీసేవా కేంద్రాన్ని తనిఖీ చేసిన మేనేజర్



జనగామలో మీ-సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న మేనేజర్ దుర్గారావు

జనగామ కల్చరల్, జూన్ 12: జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఏరియాలో గల మీసేవా కేంద్రాన్ని బుధవారం ఈ-జిల్లా మేనేజర్ దుర్గారావు తనిఖీ చేశారు. మీ-సేవా కేంద్రంలో జరుగుతున్న పని విధానాన్ని పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. రిజిస్ట్రేషన్, సర్టిఫికేట్ల జారీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా రాష్ట్ర ప్రభుత్వం క్యూఆర్ కోడ్ పద్ధతి ద్వారా క్యాష్‌లెస్ ఆన్‌లైన్ లావాదేవీలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, ఈ పథకం అన్ని ప్రైవేటు, ప్రభుత్వ మీ-సేవా కేంద్రాల్లో అమలు చేయాలని భావిస్తోందన్నారు.

వరుణుడి కరుణ కోసం పూజలు



వానదేవుడిని కీర్తిస్తూ ఉయ్యాల పాట పాడుతున్న మహిళలు

జఫర్‌గడ్, జూన్ 12 : వానాకాలం సీజన్‌లో పంటల సాగుకు వర్షాలు కురవాలని వరుణదేవుడిని కొలుస్తూ గ్రామాల్లో రైతులు, ప్రజలు పూజలు చేస్తున్నారు. రోహిణీ కార్తె పోయి మృగశిర కార్తె వచ్చినా వర్షాల జాడ లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీజన్ ఆరంభంలో కురిసిన తొలకరి వర్షంతో అనేక గ్రామాల్లో రైతులు దుక్కులు దున్ని విత్తనాలు వేశారు. ఆ తరువాత వానలు కురవకపోవడంతో విత్తనాలు మొలకెత్తలేదు. నీటి వసతి కలిగిన రైతులు బోర్ల ద్వారా నీటి తడులు పెడుతూ అగచాట్లు పడుతున్నారు. మరికొంత మంది రైతులు దుక్కులు దున్ని భూములను సిద్ధంగా ఉంచారు. వర్షాలు కురిసిన వెంటనే విత్తనాలను విత్తేందుకు రెడీగా ఉన్నారు. అయితే అపుడపుడు ఆకాశంలో మబ్బులు, ఉరుములు, మెరుపులతో చిరుజల్లులే తప్ప వర్షాలు కురవడం లేదు. ఈ నేపథ్యంలో వరుణుడి కరుణ కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. వానలు కురవాలని, చెరువులు కుంటలు నిండాలని, పంటలు సమృద్ధిగా పండాలని వరుణదేవుడిని పలు రూపాల్లో కొలుస్తూ పూజలు చేస్తున్నారు. బుధవారం తిమ్మంపేటలో మహిళలు, రైతు కూలీలంతా కలిసి వరుణదేవుడిని కొలుస్తూ ఉయ్యాల పాటలు పాడారు. వర్షాలు కురిపించాలని వేడుకున్నారు.

నేడు బహిరంగ వేలం

లింగాలఘణపురం, జూన్12: మండలంలోని నవాబుపేట శ్రీకోదండరామస్వామి దేవాలయం ప్రాంగణంలో ప్రతీ శుక్రవారం జరిగే పశువుల సంతకు సంబంధించిన లారీల గడ్డ, పగ్గాల విక్రయ హక్కుల కోసం ఈనెల 13న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో లక్ష్మీప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. నవాబుపేట దేవాలయ ప్రాంగణంలో ఉదయం 10.30 గంటకు జరిగే వేలం పాటలో పాల్గొనేందుకు 96 షెడ్యూల్ ఫామ్‌లు విక్రయించినట్లు ఈవో తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, జూన్ 12: జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఒకటి, ఐదో తరగతిలో చేరాలనుకునే ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కె.దయానందరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను 1వ తరగతి డేస్కాలర్‌లో చేరేందుకు 18 సీట్లు, 5వ తరగతిలో చేరేందుకు 31 సీట్లు ఉన్నాయని, అర్హులైన ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

సంబురంగా బడి పండుగ

- తొలిరోజు వేడుకలా పునఃప్రారంభమైన పాఠశాలలు
- అందంగా ముస్తాబు చేసి స్వాగతం పలికిన ఉపాధ్యాయులు

జనగామ కల్చరల్, జూన్ 12: వేసవి సెలవులు ముగించుకొని జిల్లావ్యాప్తంగా పాఠశాలలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు పాఠశాలలు తెరచుకోగా విద్యార్థులు సెలవుల మబ్బులు విదుల్చుకొని భుజాన బ్యాగులతో పాఠశాలలకు బయల్దేరారు. ఉపాధ్యాయులు



కొడకండ్లలో టీజీఆర్ఎస్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యునిఫాంలను అందజేస్తున్న ఎంపీపీ జ్యోతి

పండుగ వాతావరణంలో కార్యక్రమాలను నిర్వహించారు. గేటు వద్ద నిలబడి విద్యార్థులకు పూలతో స్వాగతం పలికారు. జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. నియోజకవర్గ స్థాయిలో ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జడ్పీ పాఠశాలలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొని విద్యార్థులకు దుస్తులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. కాగా, తొలిరోజు విద్యార్థులు మందకొడిగా హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ప్రైవేటుకు దీటుగా విద్య: కలెక్టర్

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యాబోధన అందుతోందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం లోని ధర్మకంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని పండుగల నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు గాను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించిన పనులతో పాటు పీఎంశ్రీ, 'మన ఊరు - మన బడి' పథకం కింద మిగిలి ఉన్న పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు ఇప్పటికే పాఠశాలలకు చేరాయన్నారు. విద్యార్థులు ప్రతి రోజూ తప్పనిసరిగా పాఠశాలలకు హాజరు కావాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అధికంగా ఉత్తీర్ణులయ్యారని, రానున్న విద్యా సంవత్సరంలో కూడా 10/10 జీపీఏ సాధించాలని అన్నారు. 2024-25 సంవత్సరానికి గాను 9.8 జీపీఏ సాధించిన హర్షిత అనే విద్యార్థిని కలెక్టర్ శాలువాతో సన్మానించారు. అదే విధంగా రాష్ట్ర స్థాయి ఖోఖోలో ప్రతిభ కనబరిచిన సాత్విక్ అనే విద్యార్థికి ప్రశంసాపత్రం అందించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఒక జత యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ పోకల జమున, జడ్పీ చైర్‌పర్సన్ ఎర్రబోయిన భాగ్యలక్ష్మి, డీఈవో కే.రాము, గౌసియాబేగం, వార్డు కౌన్సిలర్ చంద్రకళ, ఎంపీడీవో సంపత్‌కుమార్, హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జనగామ జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

త్వరలోనే విద్యా కమిషన్ ఏర్పాటు

- 'బడిబాట'ను మొక్కుబడిగా నిర్వహించొద్దు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



బడిబాట ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ, అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 12: త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయబోతోందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. బుధవారం ఆయన ఛాగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీ కడియం కావ్యతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న విద్యా కమిషన్ ద్వారా అందరికీ విద్యను అందుబాటులోకి వస్తుందని, నాణ్యమైన విద్య అందుతుందని, పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తామని, డిజిటల్ విద్య అందిస్తామని అన్నారు. బడిబాట కార్యక్రమం మొక్కుబడిగా కాకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు గ్రామాల్లో పర్యటించి పిల్లలను బడిలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. ఆదర్శ అమ్మ పాఠశాల కమిటీలతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని, కమిటీలకు రూ.2వేల కోట్లు కేటాయించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు.

సర్కారు స్కూళ్లలోనే నాణ్యమైన విద్య: ఎంపీ కావ్య

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని కడియం కావ్య అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలను దృష్టిలో పెట్టుకొని వారికి విద్యా బోధన చేయాలన్నారు. రానున్న రోజుల్లో తాను విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డీఈవో రాము, ఏసీపీ భీమ్‌శర్మ, ఎంపీపీ కందుల రేఖ-గట్టయ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ఉమాదేవి, డీటీ విజయ్‌కుమార్, సీడీపీవో ఫ్లోరెన్స్, ఎంపీటీసీలు నర్సింహులు, కనకం స్వరూప-గణేష్, నోడల్ అధికారి కొమురయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి

డీలర్లకు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాలు



పటేల్‌గూడెంలోని ఓ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

వివరాలు 10వ పేజీలో..



పెరుమాండ్ల సంకీసలో ప్రాథమిక పాఠశాల గేటుకు తాళంవేసిన కాంట్రాక్టర్

బిల్లు రాలేదని..

స్కూల్‌కు తాళం వేసిన కాంట్రాక్టర్

తిరిగి వెళ్లిపోయిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

డోర్నకల్, జూన్ 12 : మండలంలోని పెరుమాండ్ల సంకీస ప్రాథమిక పాఠశాలకు బుధవారం ఓ కాంట్రాక్టర్ తాళం వేశాడు. 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా స్కూల్‌కు నూతన బిల్డింగ్ నిర్మాణం, ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.60 లక్షలు నిధులు మంజూరయ్యాయి. పనులు చేస్తున్న సమయంలో కొంతబిల్లును పంచాయతీరాజ్‌శాఖ కాంట్రాక్టర్‌కు చెల్లించింది. తర్వాత కాంట్రాక్టర్ పనులు మొత్తం పూర్తి చేశాడు. నిర్మాణం పూర్తై ఏడాది గడుస్తున్నప్పటికి కాంట్రాక్టర్‌కు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో పలుమార్లు అధికారుల వద్ద విన్నవించుకున్నాడు. అయినప్పటికి బిల్లులు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పాఠశాలకు ఏకంగా తాళం వేశాడు. బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కాంట్రాక్టర్ గేటుకు తాళం వేయడంతో పాఠశాల వద్దకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు వెనుదిరిగి వెళ్లారు. పాఠశాలకు తాళం వేసిన విషయాన్ని ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

కిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



హసన్‌పర్తి, జూన్ 12: ఎర్రగట్టుగుట్ట వద్ద గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నలిగంటి సంతోష్‌కుమార్‌కు విశాఖపట్నం గీతం యూనివర్సిటీ పీహెచ్‌డీని ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డి బుధవారం తెలిపారు. 'బ్లడ్ వేసెల్ సిగ్మెంటేషన్ ఫ్రమ్ డయాబెటిక్ రెటినోపతి ఫండస్ ఇమేజెస్ యూజింగ్ సింగులర్ వాల్యూ డికపోజిషన్ అండ్ మాక్సిమమ్ ప్రిన్సిపల్ కర్వేచర్' అనే అంశంపై పరిశోధనలు సమర్పించినందుకు గాను పీహెచ్‌డీ వచ్చినట్లు పేర్కొన్నారు. సంతోష్‌కుమార్‌కు పీహెచ్‌డీ రావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి, ఛైర్మన్ కెప్టెన్ లక్ష్మికాంతరావు, కోశాధికారి నారాయణరెడ్డి, తోటి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

19న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12: హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 19న నిర్వహిస్తున్న జాబ్ మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఐఈవో ఎ.గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం కోసం సీఈసీ, హెచ్ఈసీ, వొకేషనల్ కంప్యూటర్స్ కోర్సుల్లో 75 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఈ జాబ్ మేళాలో డీవీవో రోల్ కోసం ఎంపిక చేసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2023, 2024 విద్యా సంవత్సరాల్లో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు హాజరుకావచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 7569177071 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

కేజీబీవీల్లో సరుకుల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12: జిల్లాలోని 9 కేజీబీవీలు, 3 మోడల్ స్కూళ్లు, ఒక్క అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో వివిధ సరుకులు సరఫరా చేసేందుకు ఆసక్తిగల వారి నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో అబ్దుల్ హై బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సరుకులు, పండ్లు, కూరగాయలు, గుడ్లు, చికెన్, మటన్ తదితర వస్తువులు సరఫరా చేసేందుకు సీల్డ్ టెండర్లు దాఖల చేయాలని తెలిపారు. ఆసక్తి గల వారు కలెక్టర్ పేరున తీసిన రూ.500 డీడీ చెల్లించి టెండర్ ఫారాలు తీసుకొని ఈనెల 21 మధ్యాహ్నం 3 గంటల వరకు డీఈవో కార్యాలయంలోని టెండర్ బాక్స్‌లో వేయాలని కోరారు. వేర్వేరు వస్తువులకు వేర్వేరు టెండర్లు దఖాలు చేయాలని తెలిపారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట్), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లిష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

- ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..
- మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచకముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

రెసిడెన్షియల్ కోసం అద్దె భవనం కావాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12: సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల కోసం ములుగు జిల్లా పరిధిలో అద్దె భవనం కావాలని ఆర్‌సీవో ఎస్.విద్యారాణి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బాలురు, బాలికల పాఠశాల/కళాశాల నిర్వహణ కోసం 16 తరగతి గదులు, డైనింగ్ హాల్, ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా గదులు, అన్ని వసతులున్న భవనం కావాలని ఆమె కోరారు. ఆసక్తి ఉండి, భవనం ఉన్న వారు 7995010600/7995010599 నెంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

నిజామాబాద్‌కు 12 డీలక్స్ సర్వీసులు

బాలసముద్రం, జూన్ 12: వరంగల్ నుంచి నిజామాబాద్‌కు 12 డీలక్స్ బస్సు సర్వీస్‌లను గురువారం నుంచి నడుపుతున్నట్లు వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జాన్సి శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ మేనేజర్ శ్రీలత ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యం కోసం అదనంగా 12 డీలక్స్ బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్ నుంచి ఉదయం 4.15 గంటలకు, రాత్రి 11 గంటల వరకు ప్రతీ అరగంటకు ఒక డీలక్స్ బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆమె ప్రకటనలో కోరారు. వరంగల్ నుంచి నిజామాబాద్‌కు ఒకరికి రూ. 350, హనుమకొండ నుంచి నిజామాబాద్‌కు రూ.340, కరీంనగర్ నుంచి నిజామాబాద్‌కు రూ. 230, హనుమకొండ నుంచి కరీంనగర్‌కు రూ 120 టికెట్ ధర తీసుకోనున్నట్లు శ్రీలత తెలిపారు.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు..

● అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ● మడికొండలో ఎంపీ కడియం కావ్య ఆత్మీయ సన్మాన సభ


మడికొండలో జరిగిన అభినందన సభలో అభివాదం చేస్తున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు

మడికొండ, జూన్ 12: అధికారం అలంకారం మాత్రమేనని, అది శాశ్వతం కాదని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో బుధవారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆత్మీయ పరిచయ, సన్మాన సభలో మంత్రి సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

గత ప్రభుత్వ హయాంలో వారు చేసిన అవినీతి, అక్రమాలే వారి ఓటమికి కారణాలయ్యాయని, అలాంటి పరిస్థితి మనం తెచ్చుకోకూడదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు.. ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో నిష్పక్షపాతంగా, అవినీతిరహితంగా ఒక్క రూపాయి ఆశించకుండా నిరుపేదల ఇంటికి చేరే విధంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ విధంగా పనిచేస్తేనే రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తారన్నారు. అధికారం ఉంది కదా అని అహంకారం చూపిస్తే బీఆర్ఎస్ పార్టీని బొందపెట్టినట్టే మన ప్రభుత్వాన్ని సైతం ప్రజలు తిరస్కరిస్తారని హితవు పలికారు. తనకు కూతురులాంటి డాక్టర్ కడియం కావ్య.. తండ్రిని మించిన నాయకురాలిగా ఎదిగి మచ్చలేని తన తండ్రి పేరును నిలబెట్టాలన్నారు. వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. అలాగే పార్లమెంట్‌లో సమస్యలపై ఎలా గళం ఎత్తాలన్నారు. అనంతరం ఎంపీ డాక్టర్ కావ్య మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్‌లో గళం ఎత్తుతానని అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా ఉంటే రానున్న మరో పదిహేనేళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉంటుందన్నారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు అన్నింటికీ సమ ప్రాధాన్యం ఇచ్చి నిధులు అందజేస్తానని తెలిపారు. అలాగే తనకు రాజకీయ జీవితం ఇచ్చిన తన తండ్రికి మచ్చరాకుండా మంచిపేరు తీసుకు వచ్చేలా పనిచేస్తానని తెలిపారు.

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పాత, కొత్త అనే తేడాలేకుండా పనితరును, అభిమానాన్ని బట్టి అందరికీ అవకాశాలు లభిస్తాయన్నారు. రాజకీయాల్లో మర్యాద, నిజాయితీలే కాపాడుతాయన్నారు. తన మాట తీరు చాలామందికి బాధ కలిగించిదని, అర్థం చేసుకున్న తర్వాత వారే స్వీకరిస్తున్నారన్నారు. నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడితే కార్యకర్తలే గౌరవించరన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో డబ్బు పంచడం, పథకాలు అమ్ముకోవడం సర్వసాధారణమైందని, తాను మాత్రం ఏ పనిచేసినా ఎవరి వద్ద నుంచి కూడా ఒక్క పైసా అడగనన్నారు. ఎవరైనా తన పేరుతో డబ్బులు అడిగితే వారిపై చర్యలు తీసుకుంటానన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అవినీతి రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. కిందిస్థాయి నాయకులు సైతం భూ వివాదాలు, భూ కబ్జాలు, అక్రమాలకు పాల్పడే వారికి వంతపాడకూడదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అనేక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నాయని, వాటిపై దృష్టి పెట్టి అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎవరైనా గ్రూపు రాజకీయాలకు పాల్పడితే తోకలు కత్తిరిస్తామని కడియం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇందిర, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతకుముందు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జాతీయ రహదారి నుంచి కావ్యను, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని వాహనంలో కన్వెన్షన్ హాల్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా దారిపొడవునా పూల వర్షం కురిపించారు. టపాసుల మోతతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. బంజారా, లంబాడా మహిళలు తమ సంస్కృతీ సంప్రదాయ దుస్తులు ధరించి బంజారా నృత్యం చేస్తూ కావ్య, శ్రీహరికి ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ శ్రేణుల గజమాలతో కావ్యను, శ్రీహరిని ఘనంగా సత్కరించారు.

తేనెటీగల దాడితో మృతదేహాన్ని వదిలి పరిగెత్తారు..

పలువురికి తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు


కొత్తగూడ మండలం ఎంచగూడెంలో వీరస్వామి మృతదేహాన్ని వదిలి వెళ్తున్న బంధువులు, గ్రామస్థులు, రోడ్డుపై వీరస్వామి మృతదేహం

కొత్తగూడ, జూన్ 12 : ఓ వ్యక్తి అంతిమయాత్ర నిర్వహిస్తున్న క్రమంలో తేనెటీగలు దాడిచేయగా.. వారంతా మృతదేహాన్ని రోడ్డుపైనే వదిలేసి పరిగెత్తిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెం గ్రామంలో బుధవారం జరిగింది. ఎంచగూడెం గ్రామానికి చెందిన రుద్రారపు వీరస్వామి (50) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. బుధవారం అతడి దహనసంస్కారాలు నిర్వహించేందుకు గాను కుటుంబసభ్యులు, బంధువులు, స్థానికులు అంతిమయాత్రగా శ్మశానవాటికకు బయల్దేరారు. వారు గ్రామశివారులో చేరుకున్న తర్వాత టపాసులు పేల్చగా వాటి పొగ, శబ్దానికి చెట్టుపై ఉన్న తేనేటీగలు ఒక్కసారిగి లేచి దాడి చేశాయి. దీంతో స్థానికులు, బంధువులు వీరస్వామి మృతదేహాన్ని రోడ్డుపైనే వదిలి పరుగు తీశారు. ఆతర్వాత వారంతా సుమారు గంట తర్వాత అక్కడికి వచ్చి వీరస్వామి మృతదేహాన్ని తీసుకెళ్లి దహనసంస్కారాలు పూర్తి చేశారు. నిర్వహించారు. కాగా, తేనేటీగల దాడిలో కందికొండ యాకయ్య, కందికొండ మల్లయ్య, జిట్టి కొమురయ్యతో పాటు పలువురికి తీవ్రగాయాలు కావడంతో 108లో వరంగల్ జిల్లాలోని నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి

డీలర్లకు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాలు

లింగాలఘణపురం, జూన్12: రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా విత్తన డీలర్లను ఆదేశించారు. బుధవారం ఆయన లింగాలఘణపురం మండలం నెల్లుట్లలోని ఎస్ఎస్ అగ్రిమాల్‌తో పాటుగా పటేల్‌గూడెంలోని ఆగ్రో సర్వీస్ సెంటర్‌ను అడిషనల్ కలెక్టర్ పర్మర్ పింకేష్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసిన ప్రతీ రైతు వివరాలను ఫోన్ నెంబర్‌తో సహా రిజిష్టర్‌లో తప్పకుండా నమోదు చేసుకోవాలని సూచించారు. కల్తీ విత్తనాలను అమ్మకూడదని, బ్లాక్‌లో విక్రయాలు చేయకూడదని సూచించారు. అదేవిధంగా రైతులు కూడా తాము కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు సంబంధించిన రశీదులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. డీలర్లు ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు ఈపాస్ మిషన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఏవో వినోద్‌కుమార్, తహసిల్దార్ వినయలత ఉన్నారు.

మిషన్ భగీరథ సర్వే పరిశీలన..


పటేల్‌గూడెంలో మిషన్‌భగీరథ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

లింగాలఘణపురం మండలం పటేల్‌గూడెంలో మిషన్ భగీరథ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సర్వేను కలెక్టర్ రిజ్వాన్ బాషా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటి నల్లా కనెక్షన్ల వివరాలను సమర్థవంతంగా యాప్‌లో ఎంట్రీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా నల్లా ద్వారా ఇంటింటికీ నీటి సరఫరా సక్రమంగా జరుగుతందా లేదా అని స్థానికులను అడగగా నీటి కొరత లేకుండా పంపిణీ జరుగుతోందని చెప్పారు. ఆయన వెంట ఎంపీవో మల్లికార్జున్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయాలి..

జనగామ కల్చరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు లక్ష్యాలను వంద శాతం సాధించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఐపీసీ (డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కమిటీ) సభ్యులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం డీఐపీసీ కింద 37 దరఖాస్తులు రాగా 28 దరఖాస్తులకు ఆమోదం లభించినట్లు తెలిపారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు చెందిన 8 దరఖాస్తులలో ఏడింటికి, టీజీఐఐసీ కింద మూడింటిలో ఒక దానికి, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ కింద ఒకదానికి, టీఎస్ఎన్‌పీడీసీఎల్ కింద 19 దరఖాస్తులు రాగా 14 దరఖాస్తులకు, కర్మాగారాల కింద 5 దరఖాస్తులకు గాను నాలిగింటికి, కుడా కింద ఒకదానికి ఆమోదం లభించినట్లు వివరించారు. టీ-ప్రైడ్ 2014 పథకం కింద నాలుగింటికి, టీఎస్‌పీ కింద 16 దరఖాస్తులకు పెట్టుబడి రాయితీ మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జీఎం ఇండస్ట్రీస్ మేనేజర్ రమేష్, ఎల్‌డీఎం శ్రీధర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

15న జాబ్ మేళా

జనగామ కల్చరల్, జూన్ 12: నిరుద్యోగ యువతీ యువకులకు ఈ నెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సీహెచ్.ఉమారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కో లిమిటెడ్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ (10), బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్(10) పోస్టులకు ఏదైనా డిగ్రీ అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎగ్జిక్యూటివ్‌కు నెలకు రూ.18 వేలు, మేనేజర్ పోస్టుకు నెలకు రూ.25 వేలు జీతం చెల్లిస్తారన్నారు. 22 నుంచి 35 సంవత్సరాల వయసు గలిగి అర్హత గల అభ్యర్థులు ఈ నెల 15న కలెక్టరేట్‌లోని ఎంప్లాయ్‌మెంట్ అధికారి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్ జిరాక్స్ కాపీ, పాస్‌పోర్టు సైజు ఫోటోతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 79954 30401 నంబరులో సంప్రదించాలన్నారు.



దేవరుప్పుల బాలయేసు పాఠశాలలో ఘనంగా ఇనాగరేషన్ డే జరుపుకుంటున్న విద్యార్థులు


లింగాలఘణపురంలో విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి

పండగలా బడుల పునఃప్రారంభం

విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు ● పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, జూన్ 12: జిల్లావ్యాప్తంగా బుధవారం ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులకు పుష్పగుచ్ఛాలతో ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. పాఠశాల ప్రాంగణాలను మామిడితోరణాలతో పాటుగా అందమైన రంగవల్లులతో అలంకరించారు. విద్యార్థుల్లో సహృద్భావ వాతావరణం నెలకొల్పడంతో పాటుగా సానుకూల దృక్పథం ఇనుమడింప చేసేవిధంగా సకల సౌకర్యాలను ఏర్పాటు చేశారు. మండలస్థాయిలో ప్రజాప్రతినిధులు హాజరై విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని జనగామ ఎంపీపీ మేకల కళింగరాజు ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల విద్యా ప్రగతికి ప్రభుత్వం కృషి చేస్తోందని జఫర్‌గడ్ ఎంపీపీ రడపాక సుదర్శన్, జడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ బడుల్లోనే పిల్లల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని బచ్చన్నపేట ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని రఘునాథ్‌పల్లి ఎంపీపీ మేకల వరలక్ష్మి అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని లింగాలఘణపురం ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని జనగామ డీఆర్‌డీవో పీడీ మొగులప్ప అన్నారు. పాలకుర్తిలో ఆయన విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కొడకండ్ల టీజీఆర్ఎస్‌లో ఎంపీపీ డి.జ్యోతి, హెచ్ఎం దిలీప్ తమ్మి విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. కడవెండి ప్రభుత్వ పాఠశాలలో దేవరుప్పుల ఎంపీపీ బస్వ సావిత్రి యూనిఫామ్స్ పంపిణీ చేశారు. నర్మెట మండలం మల్కపేట, హన్మంతాపూర్ గ్రామాల్లో విద్యార్థులకు జడ్పీ సీఈవో అనిల్‌కుమార్ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌ను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన లభిస్తుందని చిలుపూర్‌లో ఎస్సీ కార్పొరేషన్ ఈడీవిక్రమ్ కుమార్ అన్నారు.


పోచన్నపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి


చిలుపూర్‌లో విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విక్రమ్‌కుమార్


కడవెండిలో విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్న దేవరుప్పుల ఎంపీపీ బస్వ సావిత్రి


శామిర్‌పేట ఎంపీపీఎస్‌లో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మేకల కళింగరాజు


మల్కపేటలో విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్న జడ్పీ సీఈవో అనిల్‌కుమార్


కోమల్లలో విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎంపీపీ మేకల వరలక్ష్మి


సోలిపురంలో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు


తమ్మడపల్లి(జి)లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సుదర్శన్

బాలయేసు పాఠశాలలో ఇనాగరేషన్ డే..

దేవరుప్పుల: మండలకేంద్రంలోని బాలయేసు హైస్కూల్ పునఃప్రారంభాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ఘనంగా ఇనాగ్రేషన్ డే జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా ఫాదర్ దిలీప్‌కుమార్ పాల్గొని ఏసుప్రభువు మందిరంలో ప్రత్యేకపూజలు చేశారు. విద్యార్థులు ఏసు ప్రభువుకు పుస్తకాలు, పెన్నులు సమర్పించుకున్నారు. కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖాజా, మదన్‌మోహన్, మహేష్, కృష్ణ, పాషా, అనిత, మాధవి, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తిలో విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేస్తున్న అధికారులు


తిమ్మంపేట హైస్కూల్ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ బేబీ శ్రీనివాస్

బుగులు వేంకన్న సన్నిధిలో కడియం, కావ్య పూజలు

చిలుపూర్, జూన్ 12 : చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న ఆలయాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య బుధవారం సందర్శించారు. వారికి ఈవో లక్ష్మీప్రసన్నతో పాటు, పూజారులు బ్రాహ్మణపల్లి రవిందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యుల బృందం పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా నేతలకు స్వామివారి శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలు, ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం, ఎంపీ కావ్య మాట్లాడుతూ, అద్భుతమైన మెజారిటీని అందించిన స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదన్నారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు, రెండవ తిరుపతిగా ప్రసిద్ధి చెందుతున్న చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న ఆలయ అభివృద్ధికి ఇప్పటికే మంజూరైన రూ 10 కోట్లతో పాటు, మరిన్ని నిధులను మంజూరు చేయించి సౌకర్యాలను కల్పిస్తామని అన్నారు. చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు నేతృత్వంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత -బాలరాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు గౌడ్, మాజీ చైర్మన్లు మామిడాల యాదవరెడ్డి, మూల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, నాయకులు మామిడాల లింగారెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, రంగు రమేష్, మారబోయిన ఎల్లయ్య, తాళ్ళపల్లి సమ్మయ్య, తీగల మహేందర్, ఏడవెల్లి మల్లారెడ్డి, పాశం సురేశ్, గడ్డమీది వెంకటస్వామి, భూక్య రమేష్‌నాయక్, ఇల్లందుల హరిబాబు, రత్నాకర్‌రెడ్డి, చేరాలు పాల్గొన్నారు.


ఆలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం, ఎంపీ కడియం కావ్య

ఫ్లెక్సీలను చింపివేసిన గుర్తు తెలియని వ్యక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని జాతీయ రహదారి వీయూపి (వెహికిల్ అండర్ పాస్)కి కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ వరంగల్ ఎంపీగా కడియం కావ్య భారీ మెజార్టీతో గెలుపొందడాన్ని జీర్ణించుకోలేక కొంతమంది ప్రతిపక్ష నాయకులు కావాలనే ఫ్లెక్సీని చింపివేశారని, కడియం కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక చిల్లర రాజకీయాలు చేస్తున్నారని కడియం వర్గీయులు విమర్శించారు. సంబంధిత అంశమై సీఐ ముస్కు రాజును వివరణ కోరగా ఫ్లెక్సీ చింపివేసిన విషయమై తనకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

వారం రోజుల్లో సర్వే పూర్తి చేయాలి

పాలకుర్తి, జూన్ 12: మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటికీ వెళ్లి చేస్తున్న సర్వేను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఎంపీడీవో రాములు ఆదేశించారు. బుధవారం పాలకుర్తిలో జీపీ సిబ్బంది చేస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 36 గ్రామాల్లో 77 మందిని నియమించి ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. వారం రోజుల్లో సర్వే పూర్తి చేసి మిషన్ భగీరథ పథకం ద్వారా నల్లాలు లేని ఇళ్లు ఎన్ని ఉన్నాయో నివేదికను అందచేయాలని అన్నారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి కపిలవాయి వెంకటేశ్వరాచారి పాల్గొన్నారు.

బచ్చన్నపేట: మండలంలో మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను ఎంపీడీవో రఘురామకృష్ణ బుధవారం పరిశీలించారు. బచ్చన్నపేట మండల కేంద్రంతోపాటు ఆలీంపూర్, నక్కవానిగూడెం, కొడవటూర్, కొన్నె, లింగంపల్లి, కేశిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించి అక్కడి సర్వే తీరు చూశారు. గృహ యజమానుల వివరాల నమోదు, తాగునీటి వసతి తదితర అంశాలు యాప్‌లో సక్రమంగా నమోదు చేస్తున్నారా లేదా తనిఖీ చేశారు.


పాలకుర్తిలో మిషన్‌భగీరథ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాములు

శనివారం నాటికి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు అనిల్‌రాజ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపును నిలిపివేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సింగారపు రమేష్

దేవరుప్పుల, జూన్ 12: మండలంలోని గొల్లపల్లి, రంభోజీగూడెం వాగుల నుంచి రిజర్వాయర్ల నిర్మాణానికి ఇసుక తరలింపు అనుమతులు వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం దేవరుప్పులలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వాగులోనుంచి ఇసుకను ఇతర మండలాలకు తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి రైతుల బోర్లు వట్టిపోతున్నాయన్నారు. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులకు సాగునీటి వనరులు కల్పిస్తామని ప్రభుత్వం ఒక వైపు చెబుతుంటే మరోవైపు రైతులకు నష్టం వాటిల్లే పని చేస్తున్నదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి వెంటనే అనుమతులు రద్దు చేయాలని కోరారు. లేదంటే రైతులతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంటి వెంకట్ రెడ్డి, గడ్డం యాదగిరి, నల్ల కిష్టయ్య, బక్క యాదగిరి పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో గిరిజన సంఘాల వినతిపత్రం

జనగామ కల్చరల్, జూన్ 12: జిల్లాలోని గిరిజన సంక్షేమ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో ఏవో రవీందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు కాస్మోటిక్స్ త్వరితగతిన అందించాలని అన్నారు. సంక్షేమ హాస్టళ్లను ఆశ్రమ పాఠశాలలుగా కన్వర్ట్ చేయాలన్నారు. మండలం లోని పసరమడ్ల గ్రామ పరిధిలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలకు సొంత భవనం నిర్మాణం కోసం 5 ఎకరాల స్థలం కేటాయించి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బూక్యా చందు నాయక్, అజ్మీరా సురేష్ నాయక్ పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

బెస్ట్ అవైలబుల్ స్కీంకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, జూన్ 12: బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా లక్కీ డ్రా పద్ధతిన 20 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద డ్రా నిర్వహించారు. స్కీంకు 84 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా డ్రా పద్ధతిన 20 మంది విద్యార్థులను ఎంపిక చేసి, మూడు ప్రైవేటు పాఠశాలల్లో సీట్లు కేటాయించారు. ఎంపికైన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ప్రేమకళ, ఏవో శ్రీరాములు, ఉపాధ్యాయులు బి.వాసునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్‌పై ఏఈవోల నిరసన


కొడకండ్ల రైతువేదిక ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఏఈవోలు

కొడకండ్ల జూన్ 12 : మండలకేంద్రంలోని రైతువేదిక వద్ద పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల ఏఈవోలు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లాలో అకారణంగా ముగ్గురిని, ఆదిలాబాద్ జిల్లాలో ఒక ఏఈవోను ప్రభుత్వం సస్పెండ్ చేసిందని, వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ఎం.వెంకటేష్, మహేష్, సంతోష్, సాగర్, సాయి కిరణ్, నవ్య, సంధ్య, శ్రావణి, ప్రియాంక, అరుణశ్రీ, రాధిక, కీర్తి, సువర్ణ పాల్గొన్నారు.

చీటకోడూరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలి

జనగామ కల్చరల్, జూన్ 12: చీటకోడూరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని బ్రిడ్జి సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనగామ నుంచి చీటకోడూరు, చౌడారం, మరిగడి తదితర గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలని లేని పక్షంలో వచ్చే వర్షాకాలంలో బ్రిడ్జి పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదముందని అన్నారు. కార్యక్రమంలో బ్రిడ్జి సాధన సమితి నాయకులు యాసారపు కర్నాకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్, చీటకోడూరు ఎంపీటీసీ మెరుగు బాలరాజు గౌడ్, మరిగడి ఎంపీటీసీ సలెంద్రి మహేశ్వరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ముగ్గురికి గాయాలు

కేసముద్రం, జూన్ 12 : కేసముద్రం మండలం బేరువాడ శివారు బోడ మంచ్యాతండా సమీపంలోని రైస్ మిల్లు మూలమలుపు వద్ద బుధవారం బైక్ అదుపుతప్పి ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కేసముద్రం నుంచి మహబూబాబాద్ వైపునకు బీహార్‌కు చెందిన అమిత్‌కుమార్, బిట్టుకుమార్, సంజయ్‌కుమార్‌లు బైక్‌పై వెళుతున్నారు. రైస్‌మిల్లు వద్దనున్న మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి పడిపోయింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తోటి కార్మికులు మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన కార్మికులు ఇదే ప్రాంతంలో నిర్మాణ రంగంలో రాడ్ బైండింగ్ పని చేస్తున్నట్లు తెలిసింది.